E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 17-04-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక:105 || పేజీలు–6
www.ekaburu.com

## బాబోయ్ 44 డిగ్రీలు...



02

## డీలిమిటేషన్ దంగల్‌కు...
# రంగం సిద్ధం!



- మహిళా బిల్లుపై లోక్‌సభలో నేడే ఓటింగ్
- ఆమోదానికి మూడింట రెండొంతుల మెజారిటీ తప్పనిసరి.. మోదీ సర్కారు ఎలా గట్టెక్కుతుందోనని సర్వత్రా ఉత్కంఠ
- రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించిన విపక్షాలు
- డివిజన్ అనంతరం చర్చకు స్వీకరించిన లోక్‌సభ
- మరో రెండు బిల్లులను కూడా ప్రవేశపెట్టిన కేంద్రం

ఈ-కబురు,న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 నుంచే అమలు చేసేందుకు మోదీ సర్కారు తలపెట్టిన కీలక కసరత్తు నిర్ణాయక దశకు చేరింది. రిజర్వేషన్ల చట్టం సత్వర అమలు, అందుకు వీలుగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు-2026, డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట (సవరణ) బిల్లు-2026ను కేంద్రం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. రాజ్యాంగ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో వాటి డిమాండ్ మేరకు ఈ అంశంపై డివిజన్ (ఓటింగ్)కు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. బిల్లుకు అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు వచ్చాయి. అనంతరం మూడు బిల్లులనూ కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.

మిగతా 2లో


## డీలిమిటేషన్.. తెలంగాణలో 26... ఏపీలో 38

- పునర్విభజన తర్వాత లోక్‌సభ స్థానాల సంఖ్య ఇదే!
- లోక్‌సభకు వెల్లడించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- దక్షిణాది రాష్ట్రాల్లో మొత్తం స్థానాల సంఖ్య 195కు
- వాటి ప్రాతినిధ్యానికి నష్టమూ ఉండదని వెల్లడి



02

## గౌలిదొడ్డి కేశవనగర్ లో పేకమేడల్లా
# అక్రమ నిర్మాణాలు



జీరో పర్మిషన్ తో వెలుస్తున్న భారీ బహుళ అంతస్థులు, వాణిజ్య సముదాయాలు
గ్రేటర్ ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులు
అక్రమ నిర్మాణాలతో తరచూ ప్రమాదాలు
స్పందించని సీఎంసీ యంత్రాంగం

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** "గౌలిదొడ్డి కేశవనగర్ లో పేకమేడల్లా అక్రమ నిర్మాణాలు పుట్టుకువస్తున్నాయి ఎటువంటి అనుమతులు లేకుండా జీరో పర్మిషన్ తో భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలు, వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎక్కడ లేని హడావిడీ చేసే సీఏంసీ అధికారులు, కనీస మౌలిక సదుపాయాలు లేని కేశవనగర్ బస్తీలో ప్రమాదకరంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాల మీద మాత్రం చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు. భవన నిర్మాణ అనుమతుల కోసం గ్రేటర్ ఖజానాకు చెల్లించాల్సిన ఫీజులను ఎగవేస్తున్న నిర్మాణదారులు తమ జేబులు నింపుకుంటున్నారు"

మిగతా 2లో

గౌలిదొడ్డి కేశవ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు



# ఒకరికి.. ఒక్కటే పదవి

...ఫైనల్ స్టేజ్‌లో ఏఐసీసీ పదవుల ప్రాసెస్.. నేడో రేపో జీవో జారీ..!

**ఈ కబురు, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ క్లైమాక్స్‌కు చేరుకుంది. పార్టీ కోసం కష్టపడిన క్యాడర్, సీనియర్ నాయకులకు 'గుడ్ న్యూస్' చెప్పేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు.నామినేటెడ్ పదవుల భర్తీ కొరకు సీఎం రేవంత్ రెడ్డితో ఏఐసీసీ ఇన్ చార్జ్ మీనాక్షి నాటరాజన్, టీపీసీసీ చీఫ్ లు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దాదాపు నాలుగు గంటల పాటు పదవుల భర్తీపై డిస్కషన్ చేశారు. జిల్లాలు, సామాజిక న్యాయం, పార్టీ కోసం పనిచేసిన నేతలు..ఇలా లిస్టును ఫిల్టర్ చేశారు. ఆశావహుల ఒక్కో పేరుపై ప్రత్యేకంగా డిస్కషన్ చేసినట్లు తెలిసింది.'ఒకరికి ఒకటే పదవి'అనే సూత్రాన్ని పాటిస్తూనే, సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దాదాపు 40కి పైగా కార్పొరేషన్లు, ప్రభుత్వ సలహాదారుల పోస్టుల కోసం వందలాది దరఖాస్తులు రాగా, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు తదితర వాటిని వడపోసి అత్యంత కీలకమైన 20 నుంచి 25 పదవులను మొదటి విడతలో భర్తీ చేయాలని ఫిక్స్ అయ్యారు.ఇక కేవలం ప్రభుత్వ పదవులే కాకుండా, పార్టీలో ఖాళీగా ఉన్న జిల్లాల అధ్యక్షులు,

02

## డీలిమిటేషన్ లో మన వాటా తగ్గితే.. తెలంగాణ సాధన తరహాలో ఉద్యమిస్తాం

- మహిళ బిల్లుకు, డీలిమిటేషన్ కు లింక్ ఏందుకు?
- లోక్ సభలో తెలంగాణ కు ఉన్న 3.13 శాతం సీట్ల ప్రాతినిధ్యం కొనసాగాలి
- కేంద్రానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అల్టిమేటం



02



## అలాగైతే రాష్ట్రం ఏర్పాటుకు భాజపా ఎందుకు మద్దతిచ్చింది?

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటును ఇండియా పాకిస్థాన్ విభజనతో పోల్చిన భాజపా ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు.

03

## తెలంగాణ ఏర్పాటుపై
# బీజేపీ విషం

.. తేజస్వి సూర్య, బిజెపి బేషరతుగా క్షమాపణ చెప్పాలి: కేటీఆర్

- తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చినా.. తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉండడం పై కేటీఆర్ ఆగ్రహం
- ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిన తీరును.. తెలంగాణ సమాజం గమనిస్తున్నది
- తెలంగాణ వ్యతిరేకత బిజెపి నరనరనా నిండి ఉన్నది
- తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బిజెపి భేషరతుగా క్షమాపణ చెప్పాలి

మిగతా 2లో



## మా తొలి క్షిపణికే.. మీ నౌకలు మునిగిపోతాయ్

... అమెరికాకు ఇరాన్ వార్నింగ్

ఈ కబురు : చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సైనిక సలాహాదారుడు మోహ్‌సేన్ రెజాయి అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు.




03

## డీలిమిటేషన్ లో మన వాటా తగ్గితే..
## తెలంగాణ సాధన తరహాలో ఉద్యమిస్తాం



ఈ కబురు,హైదరాబాద్
నియోజకవర్గాల పునర్విభజనలో తెలంగాణకు అన్యాయం చేసే కుట్ర జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ పార్లమెంట్ లో తెలంగాణకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కేంద్రం కుట్రలు సాగనివ్వమని హెచ్చరిస్తూ గురువారం వీడియో సందేశం రిలీజ్ చేశారు. మహిళ బిల్లుకు, డీలిమిటేషన్ బిల్లుకు అసలు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మహిళ బిల్లును ఎప్పుడో ఆమోదించారని డీలిమిటేషన్, మహిళ బిల్లు వేర్వేరు అంశాలని చెప్పారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి డీలిమిటేషన్ అంశాన్ని కాల్చాలని ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

--తెలంగాణకు ప్రాతినిధ్యం తగ్గొద్దు
ప్రస్తుతం పార్లమెంట్ లో తెలంగాణకు రాజకీయ ప్రాతినిధ్యం 3.13 శాతంగా ఉందని చెప్పారు. డీలిమిటేషన్ కు ఏ ప్రాతిపదికన తీసుకున్న సరే తెలంగాణ ప్రాతినిధ్యం ఏ మాత్రం తగ్గొద్దని తేల్చి చెప్పారు. మొత్తంగా 50 శాతం సీట్లు పెంచుతామంటూ ప్రతిపాదించటం కూడా సరైన పద్ధతి కాదని కవిత అన్నారు. ఉదాహరణకు బీహార్ తో పోల్చుకుంటే తెలంగాణలో పెరిగే సీట్లకు చాలా అంతరం ఉంటుందన్నారు. దీని కారణంగా తెలంగాణ రాజకీయ ప్రాధాన్యం భారీగా తగ్గుతుందన్నారు. కేంద్రం చెప్పే లెక్కల కారణంగా పెద్ద రాష్ట్రాలకు మాత్రమే ప్రయోజనం జరుగుతుందన్నారు. ఇప్పటికే నిధులు, జాతీయ ప్రాజెక్ట్ లకు హోదా ఇచ్చే విషయంలో తీవ్ర అన్యాయం చేస్తున్నారని...తెలంగాణ ప్రాతినిధ్యం మరింత తగ్గితే ఇంకా అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

--మరో ఉద్యమం తప్పదు
కేంద్రం చేస్తున్న కుట్రలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని కవిత స్పష్టం చేశారు. తెలంగాణకు, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తామంటే ఊరుకునేదే లేదని తేల్చి చెప్పారు. మరో తెలంగాణ ఉద్యమం మాదిరిగా ఉద్యమాన్ని చేపడతామని కేంద్రాన్ని హెచ్చరించారు. మహిళ బిల్లుకు డీలిమిటేషన్ ను లింక్ చేయటాన్ని తప్పుపట్టారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే మహిళ బిల్లుకు బీసీ సబ్ కోటాను లింక్ చేయాలని సూచించారు.

--ఆర్టిజన్లను బెదిరిస్తారా?
న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న ఆర్టిజన్లపై విద్యుత్ సంస్థల యాజమాన్యాలు బెదిరింపులకు పాల్పడటం దారుణమని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె చేస్తున్న వారిని డిస్మిస్ చేస్తామని బెదిరించటమంటే వారి ప్రాథమిక హక్కులను హరించటమేనని మండిపడ్డారు. ఆర్టిజన్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి మద్దతుగా జాగృతి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డగోలుగా హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను వంచిస్తోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

## బాబోయ్ 44 డిగ్రీలు...



**ఈ కబురు, హైదరాబాద్ ;**
**రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఆకాశం నుండి నిప్పులు కురుస్తున్నాయా అన్నట్లుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు.**

--ఈ జిల్లాల్లో 44 డిగ్రీల టెంపరేచర్.. బయటకు రావొద్దు
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు దంచి కొడుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో సైతం ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. సంగారెడ్డి అలాగే మహబూబ్ నగర్ జిల్లాల్లో వేడి గాలులు వీస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41%C నుంచి 44%C వరకు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో సైతం పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. అక్కడ టెంపరేచర్ 36%C నుండి 40%C మధ్య నమోదు కానుంది.

--చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్త..!
పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వడ గాల్పులు వీచే అవకాశం ఉంది. దీనివల్ల వృద్ధులు, చిన్నపిల్లలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. వేడి తీవ్రత కారణంగా భూగర్భ జలాలు అట్టడుగుకు చేరుతున్నాయి. చెరువులు కుంటలు ఎండిపోతుండటంతో పశువులకు తాగునీటి ఎద్దడి ఏర్పడుతోంది. అటవీ ప్రాంతాల్లో మంటలు చెలరేగే ముప్పు పొంచి ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

--కాటన్ దుస్తులు ధరించండి..
తీవ్రమైన ఎండల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు వాడటం మంచిది. కాటన్ దుస్తులు ధరించడం వల్ల శరీరానికి ఉపశమనం లభిస్తుంది. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలి. మజ్జిగ కొబ్బరినీళ్లు వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవడం ఉత్తమం. ప్రభుత్వ యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. వడదెబ్బ తగిలిన వారికి చికిత్స అందించేందుకు ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఉపాధి హామీ కూలీల పని వేళల్లో మార్పులు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ పాటించాలని వాతావరణ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

# డీలిమిటేషన్ దంగల్‌కు... రంగం సిద్ధం!

లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండ్ చేసి డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల బిల్లులను ఒకేసారి పరిశీలించి ఆమోదించేందుకు అనుమతివ్వాలంటూ కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. బిల్లులు రాజ్యాంగ సవరణతో ముడిపడ్డాయి గనుక ఇందుకు అనుమతించాలని కోరారు. స్పీకర్ అనుమతితో బిల్లులపై మొదలైన చర్చ గురువారం అర్ధరాత్రి దాకా సుదీర్ఘంగా సాగింది. బిల్లుకు అనుకూలంగా అధికార, వ్యతిరేకంగా విపక్ష సభ్యుల వాదనలతో సభ హోరెత్తిపోయింది. బిల్లులపై ఓటింగ్‌కు శుక్రవారం సాయంత్రం నాలుగింటికి ముహూర్తం ఖరారైంది. వాటిలో రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ఆమోదానికి మూడింట రెండొంతుల మెజారిటీ తప్పనిసరి. మోదీ సర్కారుకు అందుకు అవసరమైన సంఖ్యా బలం లేని నేపథ్యంలో బిల్లు ఎలా గట్టెక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది. దాంతో ఓటింగ్‌పై సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

హోరాహోరీ వాదనలు
పార్లమెంటు మూడు రోజుల ప్రత్యేక సమావేశాల్లో భాగంగా గురువారం ఉదయం లోక్‌సభ సమావేశం మొదలవగానే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును విపక్షాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించడంతో దానిపై 40 నిమిషాల పాటు తీవ్ర చర్చ జరిగింది. చివరికి డివిజన్ ఓటింగ్ అనంతరం సవరణ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లును మేఘ్వాల్ సభలో ప్రవేశపెట్టారు. కేంద్రపాలిత ప్రాంతాల చట్ట (సవరణ) బిల్లును హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. తర్వాత చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగొయ్ మోదీ సర్కారు తీరుపై నిప్పులు చెరిగారు. మహిళా రిజర్వేషన్ల సాకుతో లోక్‌సభ స్థానాలను అడ్డదిడ్డంగా పెంచుకుని రాజకీయ లబ్ధి పొందడమే బీజేపీ అసలు లక్ష్యమంటూ మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ల నిమిత్తం పార్లమెంటు గతంలోనే చట్టం చేశాక మళ్లీ దానికి మార్పులను ప్రతిపాదించడం వెనక మతలబు ఏమిటని కాంగ్రెస్ సభ్యుడు కె.సి.వేణుగోపాల్ కేంద్రాన్ని నిలదీశారు. రాజ్యాంగ సవరణ బిల్లును ఇతర బిల్లులతో కలిపి చర్చకు చేపట్టరాదంటూ అభ్యంతరం వెలిబుచ్చగా దాన్ని అమిత్ షా తోసిపుచ్చారు. ఒకే అంశానికి సంబంధించిన పక్షంలో వాటిని ఉమ్మడిగా చర్చకు చేపట్టిన ఉదంతాలు గతంలో ఉన్నాయని స్పీకర్ బిర్లా స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యానికి అంతమే!
రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు రూపంలో దేశ ప్రజాస్వామ్యంపై మోదీ సర్కారు బాహాటంగా దాడికి దిగిందని కాంగ్రెస్ సభ్యురాలు ప్రియాంకా గాంధీ వద్రా దుయ్యబట్టారు. ఈ బిల్లు ఆమోదం పొందితే దేశంలో ప్రజాస్వామ్యమే పూర్తిగా అంతమైపోతుందని అభిప్రాయపడ్డారు. లోక్‌సభ స్థానాలను పెంచకుండా ప్రస్తుత 543 సీట్లకే మహిళా రిజర్వేషన్లను వర్తింపజేయడంలో కేంద్రానికి ఇబ్బందేమిటని ఆమె నిలదీశారు. సవరణ బిల్లు, డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వేణుగోపాల్ ఆరోపించారు. వాటి విషయంలో ఇంత హడావుడి ఎందుకని సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లకు తమ పార్టీ మద్దతిస్తుందని స్పష్టం చేస్తూనే, జనగణన జరుగుతుండగానే ఈ హడావుడి కసరత్తు ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. బిల్లు ఉద్దేశాలను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ సంక్షిప్తంగా ప్రసంగించారు.
2029 లోక్‌సభ ఎన్నికల నాటికి కూడా మహిళా రిజర్వేషన్లను అమలు చేయకపోతే వారికి తీరని నష్టం జరుగుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ స్థానాల పెంపుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయమూ జరగబోదని స్పష్టం చేశారు. "బిల్లును వ్యతిరేకించే పార్టీలు పూడ్చుకోలేని విధంగా నష్టపోవడం ఖాయం. అది మాకే లబ్ధి చేకూరుస్తుంది" అని అన్నారు. అనంతరం విపక్షాల ప్రసంగాల మధ్యలో అమిత్ షా అప్పుడప్పుడూ జోక్యం చేసుకుంటూ వాటి వాదనలను తిప్పికొడుతూ వచ్చారు. డీలిమిటేషన్ అనంతరం దక్షిణాది రాష్ట్రాల బలం ఇప్పటితో పోలిస్తే మరింత పెరుగుతుందే తప్ప తగ్గబోదని సోదాహరణంగా వివరించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశాక కూడా పురుషులకు గానీ, ఏ రాష్ట్రానికి గానీ ఎలాంటి అన్యాయమూ జరగొద్దనే లోక్‌సభ, అసెంబ్లీల్లో స్థానాలను 50 శాతం మేరకు పెంచుతున్నట్టు వెల్లడించారు.

నల్ల దుస్తులతో డీఎంకే
మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ డీఎంకే సభ్యులు నల్ల దుస్తులతో సభకు హాజరయ్యారు. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని ఆ పార్టీ సభ్యుడు టి.ఆర్.బాలు డిమాండ్ చేశారు. ప్రతిపాదిత బిల్లుల అసలు లక్ష్యం డీలిమిటేషనే తప్ప మహిళా రిజర్వేషన్ల అమలు కాదని ఆరోపించారు. కె.సుబ్బరాయన్ (సీపీఐ), ఎన్.కె.ప్రేమ్‌చంద్రన్ (ఆరెస్పీ) తదితర విపక్ష సభ్యులు మాట్లాడుతూ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. జేడీ(యూ) తదితర ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సభ్యులు బిల్లులకు మద్దతుగా మాట్లాడారు.

**ముహూర్తం... సాయంత్రం 4!**

మూడు బిల్లులపై లోక్‌సభలో ఓటింగ్
మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు మోదీ సర్కారు ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై శుక్రవారం సాయంత్రం నాలుగింటికి లోక్‌సభ కీలక ఓటింగ్ చేపట్టనుంది. స్పీకర్ ఓం బిర్లా గురువారం సభలో ఈ మేరకు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం మోదీ తన చాంబర్లో కీలక భేటీ జరిపారు. అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ అధ్యక్షుడు నితిన నబీన్, పలు ఎన్డీఏ పక్షాల నేతలు తదితరులు అందులో పాల్గొన్నారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ఆమోదానికి అవసరమైన మూడింట రెండొంతుల మద్దతు కూడగట్టడంపై వారంతా చర్చలు జరిపారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్‌తో పాటు పలు కీలక విపక్ష పార్టీలు బుధవారమే ప్రకటించడం తెలిసిందే. అధికార ఎన్డీఏ కూటమికి పార్లమెంటు ఉభయ సభల్లోనూ సొంతంగా మూడింట రెండొంతుల మెజారిటీ లేదు. ఈ నేపథ్యంలో లోక్‌సభలో శుక్రవారం జరిగే ఓటింగ్‌లో బిల్లు ఎలా గట్టెక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# ఒకరికి.. ఒక్కటే పదవి



రాష్ట్ర కార్యవర్గ పదవులను కూడా ఒకేసారి భర్తీ చేయడం ద్వారా అసంతృప్తికి తావులేకుండా చూడాలని అధిష్టానం భావిస్తోంది.

--రెండు, మూడు రోజుల్లోనే జీవోలు..
ప్రభుత్వంలోని నామినేటెడ్ పదవుల భర్తీపై రెండు మూడు రోజుల్లోనే జీవోలు రిలీజ్ చేయనున్నట్లు తెలిసింది. ఇందుకోసం సచివాలయ వర్గాలు ఇప్పటికే కసరత్తు పూర్తి చేశాయి. పార్టీకి విధేయులుగా ఉండి, ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో కష్టపడిన వారికే ఈసారి పెద్దపీట వేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.అయితే పదవుల భర్తీ ప్రక్రియ ముగింపు దశకు రావడంతో ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది. గాంధీ భవన్ చుట్టూ, మంత్రుల నివాసాల చుట్టూ నాయకులు ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు ఈ దఫా పదవి వచ్చేలా అవకాశం చూపాలని ప్రాధేయపడుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్లు కావోస్తుందని, కానీ ఇప్పటికీ తమకు పదవి రాకపోతే ఎలా? అంటూ కొందరు మంత్రుల సన్నిహితులు సున్నితంగానే ప్రశ్నిస్తున్నారు. ఇక ఎమ్మెల్యేల ఫాలోవర్స్ లిస్టు కూడా పెద్దగానే ఉన్నదని పీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూనే, రెడ్డి వర్గంలోని కీలక నాయకులను సంతృప్తి పరచడం ప్రభుత్వానికి సవాలుగా మారింది.మరోవైపు కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో కనీసం 30 శాతం మహిళలకు కేటాయించే అవకాశం ఉన్నట్లు పార్టీలో చర్చ జరుగుతుంది. పార్టీలోని ఖాళీ పదవులు కూడా ప్రకటించే ఛాన్స్ ఉన్నది.

-కీలక స్ట్రాటజీ..?
త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ లోపే నామినేటెడ్ పదవులు, ప్రభుత్వంలోని పోస్టులను భర్తీ చేసి ముందుకు సాగాలనేది సర్కార్ ఆలోచన. ఈ పదవుల భర్తీ ద్వారా కింది స్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం నింపవచ్చని పార్టీ కూడా భావిస్తుంది. అంతేగాక గత కొన్ని రోజులుగా పెండింగ్‌లో ఉన్న పదువుల ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా పార్టీలో అంతర్గత విమర్శలకూ చెక్ పెట్టవచ్చు. మరోవరైపు ప్రభుత్వ పాలన, పార్టీ యాక్టివిటీస్ స్పీడప్ అవుతాయి. ముఖ్యంగా కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం జరిగితే, ఆయా సంస్థల ద్వారా సంక్షేమ పథకాలు ప్రజల్లోకి మరింత వేగంగా వెళ్లే అవకాశం ఉంటుంది. క్షేత్రస్థాయిలో పార్టీ పదవులు ద్వారా గ్రౌండ్ లెవల్ లో పార్టీ పటిష్టంగా ఏర్పడుతుంది. తద్వారా ఎన్నికల్లో సులువుగా విజయం సాధించవచ్చనే అభిప్రాయంలో పార్టీ ఉన్నది.

# తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ విషం



ఈ కబురు, హైదరాబాద్ :
పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకారపూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని ఆయన మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోడీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ...బిజెపి చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని ఆయన గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బిజెపి ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బిజెపి పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బిజెపి అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

# డీలిమిటేషన్.. తెలంగాణలో 26... ఏపీలో 38

ఈ కబురు న్యూఢిల్లీ: డీలిమిటేషన్ ప్రక్రియ అనంతరం తెలంగాణలో లోక్‌సభ స్థానాల సంఖ్య 17నుంచి 26కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుంచి 38కి పెరగనున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని స్పష్టం చేశారు. గురువారం లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల చట్ట రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై జరిగిన చర్చలో అమిత్ షా ప్రసంగించారు. డీలిమిటేషన్ వల్ల లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందన్న ఆందోళనను ఆయన తోసిపుచ్చారు. పునర్విభజన అనంతరం ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 129 నుంచి 50 శాతం, అంటే 195కు పెరుగుతుందని వెల్లడించారు. "దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గదు. పైపెచ్చు సభలో వాటి ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది"అంటూ గణాంకాలతో సహా మంత్రి వివరించారు.
'మొత్తం చర్చపై కేంద్ర ప్రభుత్వం తరఫున శుక్రవారం సమాధానమిస్తాను. అయితే ఒక్క విషయం మాత్రం చెప్పదలచాను. తాజాగా ప్రవేశపెట్టిన బిల్లులపై ప్రజలకు ఎలాంటి అపోహలూ వద్దు. ఈ బిల్లులతో లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గుతుందని, ఆ ప్రాంతానికి నష్టం జరుగుతుందని పెద్ద వాదనను లేవనెత్తుతూ భ్రాంతిని వ్యాప్తి చేస్తున్నారు. దీనిపై స్పష్టత ఇవ్వదలచాను. సభ ముందున్న బిల్లుల ఆధారంగా వాస్తవాలు అందరి దృష్టికీ తెస్తాను. నియోజకవర్గాల పునర్విభజనతో ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాల సంఖ్య 25నుంచి 38కు, ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 4.60 నుంచి 4.65 శాతానికి పెరుగుతాయి.
తెలంగాణలో స్థానాలు 17 నుంచి 26కు, ప్రాతినిధ్యం 3.13 నుంచి 3.18కి పెరుగుతాయి. తమిళనాడులో సీట్లు 39 నుంచి 59కు, ప్రాతినిధ్యం 7.18 నుంచి 7.23 శాతానికి పెరుగుతాయి. కర్నాటకలో లోక్‌సభ స్థానాలు 28నుంచి 42కు, సభలో ప్రాతినిధ్యం 5.15 శాతం నుంచి 5.14 శాతానికి చేరతాయి. కేరళలో సీట్లు 20 నుంచి 30కి, లోక్‌సభలో ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 3.68 నుంచి 3.67 శాతానికి చేరతాయి. మొత్తమ్మీద దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాల సంఖ్య 195కు పెరుగుతుంది. లోక్‌సభలో వాటి ప్రాతినిధ్యం 23.76 శాతం నుంచి 23.97 శాతానికి పెరుగుతుందే తప్ప ఏ మాత్రమూ తగ్గదు. అలాంటప్పుడు దక్షిణాదికి అన్యాయమన్న ప్రశ్నే తలెత్తదు"అని స్పష్టం చేశారు.

జనగణనతో పాటే కులగణన
ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనతో పాటే కులగణన కూడా ఉంటుందని అమిత్ షా స్పష్టం చేశారు. "కులగణన చేపట్టాలని కేంద్రం భావించడం లేదని విపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం జనగణనతోపాటు కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. జనగణన రెండు దశల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇళ్ల గుర్తింపు ప్రక్రియ మొదలైంది. వ్యక్తిగత డేటాను తీసుకునేటప్పుడు కులగణన అంశం కూడా వస్తుంది"అని ఆయన స్పష్టం చేశారు.

2029 తర్వాతే అమలు
నియోజకవర్గాల పునర్విభజన ఇప్పట్లో అమలు కాబోదని సభకు అమిత్ షా తెలియజేశారు. "డీలిమిటేషన్ కమిషన్ నివేదికను పార్లమెంటు ఆమోదించి, రాష్ట్రపతి ముద్ర పడిన తర్వాతే అమల్లోకి వస్తుంది. ఇదంతా 2029కి ముందు జరిగే ప్రసక్తే లేదు. కనుక అప్పటిదాకా పలు రాష్ట్రాల్లో ఎన్నికలు పాత నియోజకవర్గాల ప్రాతిపదికనే జరుగుతాయి" అని చెప్పారు.

లోక్‌సభ మొత్తం స్థానాల సంఖ్య 816!
లోక్‌సభలో సీట్ల సంఖ్య పెంపుపై విపక్షాల ప్రశ్నలకు బదులిస్తూ అమిత్ షా ఒక ఉదాహరణ చెప్పారు. "మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే ముందుగా మొత్తం సీట్లను 50 శాతం పెంచాలి. అప్పుడు వాటిలో 33 శాతం మహిళలకు కేటాయించినా మిగతా ఓపెన్ సీట్ల సంఖ్య యథాతథంగా ఉంటాయి. అంటే ప్రస్తుతమున్న 543 సీట్లను 50 శాతం పెంచితే వాటిలో 33 శాతాన్ని మహిళలకు రిజర్వ్ చేశాక కూడా ఓపెన్ కేటగిరీలో 543 సీట్లు అందుబాటులో ఉంటాయి. కాబట్టే 50 శాతం పెంపును ప్రతిపాదించాం"అని ఆయన వివరించారు. "లోక్‌సభ స్థానాల పెంపు గరిష్టంగా 850 దాకా అనేది సుమారుగా వేసిన సంఖ్య. కచ్చితమైన సంఖ్య బహుశా 815, లేదా 816గా ఉండవచ్చు. దీనిపై సభకు సమగ్రంగా వివరణ ఇస్తా"అని చెప్పారు.

# గౌలిదొడ్డి కేశవనగర్ లో పేకమేడల్లా అక్రమ నిర్మాణాలు


గౌలిదొడ్డి కేశవ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు


గౌలిదొడ్డి కేశవ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు


గౌలిదొడ్డి కేశవ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు

శేరిలింగంపల్లి నియోజకవర్గం గౌలిదొడ్డి కేశవనగర్ లో అక్రమ నిర్మాణాల పంట పండుతుంది. కేవలం వంద, రెండు వందల గజాల విస్తీర్ణంలో ఏకంగా ఏడంతస్థుల నిర్మాణాలు చేపడుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా జీరో పర్మిషన్ తో చేపడుతున్న అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు
పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ లో అక్రమ నిర్మాణాలపై అధికారుల ప్రకటనలు నీటి మీద రాతలుగా మారుతున్నాయి. అధికారుల ప్రోద్బలంతోనే గౌలిదొడ్డి కేశవనగర్ లో అక్రమ నిర్మాణాలు అంతకంతకు పెరిగి ఆకాశాన్ని అంటుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎంసీకి అణా పైసా నిర్మాణ రుసుము చెల్లించకుండా, గ్రేటర్ ఖజానాకు భారీగా గండికొడుతూ చేపడుతున్న ఈ బహుళ అంతస్థుల నిర్మాణాల్లో వాణిజ్య సముదాయాలు, హాస్టళ్లు వెలుస్తున్నాయి.

**బడాబాబులకు అడ్డులేదు... ఏ నిర్మాణానికి అనుమతి లేదు...**

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి కేశవనగర్ బస్తీలో మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి హయాంలో పేదలకు వాంబే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేశవనగర్ ను రాజీవ్ ఆవాస్ యోజన(రే) ఇళ్ల నిర్మాణం కోసం దేశంలోనే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇందుకోసం కేశవనగర్ పక్కనే ట్రాన్సిట్ గృహాలు నిర్మించి, బస్తీవాసులను అందులోకి తరలించాలని చూశారు. కానీ రే ప్రాజక్టు అటకెక్కడంతో ఈ బస్తీపై బడాబాబుల కన్నుపడింది. ఐటి కారిడార్ కు అనుకొని ఉండడంతో ఈ ప్రాంతంలో ప్రైవేటు హాస్టళ్లు నిర్మిస్తే నెలనెల లక్షల్లో సంపాదన వస్తుందని భావించిన బడాబాబులు ఇక్కడి పేదల వద్ద తక్కువ ధరకు స్థలాలను చేజిక్కించుకుంటున్నారు. శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ అధికారుల అండదండలతో ఏడాపెడా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. కేశవనగర్ బస్తీలో భవన నిర్మాణాలు చేపట్టడం నిషేధం కాగా, స్థానికంగా మాత్రం ఏడంతస్థులకు తగ్గకుండా నిర్మాణాలు కొనసాగుతున్నాయి.


అక్రమ నిర్మాణం పనుల కారణంగా కూలిన స్కూల్ ప్రహరీ గోడ (ఫైల్)

**రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల వసూళ్లు...**

గౌలిదొడ్డి కేశవనగర్ లో పూర్తిగా ఎటువంటి అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాలతో గ్రేటర్ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. కేవలం 100 నుంచి 150 గజాల విస్తీర్ణంలో ఏకంగా ఏడంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నారు. కాగా కేశవ్ నగర్ అక్రమ నిర్మాణాలు అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణం ప్రారంభమైన వెంటనే వాలిపోతున్న టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది నిర్మాణదారుల వద్ద డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు, సిబ్బంది అండతోనే కేశవనగర్ లో అక్రమ నిర్మాణాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. భవనాల మధ్య కనీస సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపడుతుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గత కొన్ని రోజుల క్రితం ఓ అక్రమ నిర్మాణం కోసం చేపట్టిన పనుల కారణంగా ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ కుప్పకూలిన విషయం తెలిసిందే. అంతకు ముందు సైతం కనీస జాగ్రత్తలు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతూ పలువురు కార్మికులు భవనంపై నుంచి కింద పడి మృతి చెందారు. ఎటువంటి అనుమతులు లేకుండా, నిర్మాణ రుసుములు చెల్లించకుండా, ప్రమాదకరంగా చేపడుతున్న కేశవ నగర్ బస్తీలోని అక్రమ నిర్మాణాలను ఇప్పటికైనా అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పేరుకే బస్తీ... ఎటు చూసినా భారీ భవంతులే...

# మా తొలి క్షిపణికే.. మీ నౌకలు మునిగిపోతాయ్

ఈ కబురు : చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సైనిక సలాహాదారుడు మోహ్‌సేన్ రెజాయి అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తే.. తమ తొలి క్షిపణి దాడికే అమెరికా (USA) నౌకలు మునిగిపోతాయని హెచ్చరించారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్మూజ్‌కు రక్షక భటుడిగా మారాలనుకుంటున్నారు. ఇది నిజంగా మీ పనా? అమెరికా వంటి శక్తిమంతమైన సైన్యం చేయాల్సిన పనేనా ఇది. జలసంధిపై ఆధిపత్యం చూపాలని చూస్తే.. మా తొలి క్షిపణి దాడికే.. మీ నౌకలు మునిగిపోతాయి. మా క్షిపణులు కచ్చితమైన దాడులు చేసి వాటిని ధ్వంసం చేయగలవు' అని రెజాయి హెచ్చరించారు. తమ దాడుల్లో జలసంధి ప్రాంతంలో ఉన్న అమెరికా బలగాల ప్రాణాలు కూడా పోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ఇక, ఇరాన్ పై భూతల దాడులకు అమెరికా సిద్ధమైందంటూ ఇటీవల పెద్దఎత్తున వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిగురించి కూడా ఆయన మాట్లాడారు. భూతల దాడులకు వచ్చిన యూఎస్ సైనికులను బందీలుగా చేసుకుంటామని హెచ్చరించారు. వారిని విడిపించుకోవాలంటే.. ఒక్కో బందీకి ఒక బిలియన్ డాలర్ ఇవ్వాల్సి వస్తుందన్నారు. అమెరికా ఇరాన్ మధ్య ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.




# గీతం ఎన్‌సీసీ పట్టభద్రులకు ఘన వీడ్కోలు


ఎస్‌సీసీ పట్టభద్రులతో గీతం వీసీ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ వర్మ, ఇతర అధికారులు


లెఫ్టినెంట్ హోదా పొందిన ఏఎస్ఓ అజయ్ కుమార్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

**కార్యక్రమానికి హాజరైన వీసీ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ వర్మ**

ఈ-కబురు, పటాన్‌చెరు :
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని గీతం డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన పట్టభద్రులకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. స్పోర్ట్స్, గీతం ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్టులుగా గీతం వీసీ ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ హాజరై ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలను అభినందించారు. ఈ సందర్భంగా వీసీ డీఎస్ రావు మాట్లాడుతూ క్రమశిక్షణ, స్థైర్యం, అంకితభావానికి ప్రతీక ఎన్‌సీసీ అని కొనియాడారు. దేశానికి అర్థవంతమైన సేవలు అందించేందుకు ముందుండాలని సూచించారు. సి సర్టిఫికెట్ సంపాదించడమే వరకే ఎన్‌సీసీ పరిమితం కాదని, సవాళ్లను ఎదుర్కొని దేశానికి ఉపయోగపడే సైనికుల్లా మారే వరకు అంకితభావమై ఉండాలని అన్నారు. అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ అజయ్ కుమార్ తన శిక్షణను పూర్తి చేసుకొని లెఫ్టినెంట్ హోదా పొందిన సందర్భంగా ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించారు. ఎన్‌సీసీ విజయాలను ప్రస్తావిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన వీడియో, క్యాడెట్లు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి

# అలాగైతే రాష్ట్రం ఏర్పాటుకు భాజపా ఎందుకు మద్దతిచ్చింది?



ఈ కబురు, హైదరాబాద్:
తెలంగాణ ఏర్పాటును ఇండియా పాకిస్థాన్ విభజనతో పోల్చిన భాజపా ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రజలను అవమానించారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన ఇండియాపాక్ విభజన లాంటిదైతే భాజపా ఎందుకు మద్దతు తెలిపిందని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ''తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం దశాబ్దాల పోరాట ప్రతిఫలం. వేలాది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజల త్యాగాల ఫలితం. మహోన్నత ఉద్యమాన్ని విద్వేషపూరిత విభజనతో పోల్చడం అవమానించడమే. తేజస్వి వ్యాఖ్యలపై భాజపా అధిష్ఠానం వైఖరి ఏంటో చెప్పాలి. ప్రధాని కూడా ఎన్నోసార్లు తెలంగాణ ఏర్పాటుపై విషం చిమ్మారు. భాజపా, కాంగ్రెస్ ఎంపీలు గుడ్లప్పగించి చూడటం సిగ్గుచేటు'' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

# అమెరికా మరో షాక్

ఈ కబురు : పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఈ క్రమంలో ఇరాన్ చమురుపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ.. అమెరికా (USA) కీలక నిర్ణయం తీసుకుంది. టెహ్రాన్‌పై ఆర్థిక ఒత్తిడిని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ బుధవారం (అమెరికా కాలమాన ప్రకారం) ఆంక్షలను ప్రకటించారు. ఇరాన్, రష్యా చమురు కొనుగోళ్లకు సంబంధించి ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా సడలించిన సంగతి తెలిసిందే. ఈ సడలింపును పొడిగించేది లేదని తాజాగా బెసెంట్ స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే ఇరాన్ చమురు ఎగుమతులతో సంబంధాలు ఉన్న అనేకమంది వ్యక్తులు, చమురు సంస్థలు, నౌకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రెజరీ శాఖకు చెందిన విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం ప్రకటించింది. ఆంక్షలకు గురైన సంస్థలు.. ఇరాన్ మాజీ సుప్రీం నేత అయతుల్లా అలీఖమేనీ రాజకీయ సలహాదారుడి కుమారుడు మహమ్మద్ హుస్సేన్ షమ్‌ఖానీ నేతృత్వంలోనివని తెలిపింది. ఫిబ్రవరిలో అమెరికా ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అలీ ఖమేనీ సలహాదారుడు ప్రాణాలు కోల్పోయారు. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ నౌకల రాకపోకలను అమెరికా దిగ్బంధిస్తోన్న సంగతి తెలిసిందే. ఇది ఇరాన్‌పై ఆర్థికంగా తీవ్ర ఒత్తిడి కలిగించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ దేశ చమురుపై మరిన్ని ఆంక్షలు విధించడం గమనార్హం. ఇక, ఇరాన్ ఆర్థిక లావాదేవీలకు చైనా బ్యాంకులు సహకరించినట్లు తెలిస్తే.. వాటిపై ఆంక్షలు విధించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బెసెంట్ హెచ్చరించారు.




**--పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేసిన ఇరాన్**

తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అన్ని పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఇరాన్‌కు చెందిన జాతీయ పెట్రోకెమికల్ కంపెనీ (NPC) పేర్కొంది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు, శత్రు దాడుల వల్ల కలిగిన నష్టాల నేపథ్యంలో దేశీయ పరిశ్రమలకు, వినియోగదారులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఎగుమతి అయి.. ఇంకా విదేశాలకు చేరని సరకును కూడా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా కంపెనీలకు సూచించింది.



# ఆరంభ లాభాలు ఆవిరి

**ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.382.36 కోట్లు**
**డీఐఐ విక్రయాలు.. రూ.3427.75 కోట్లు**

విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాల అండతో లాభాల్లో ఆరంభమైన సూచీలు చివరి వరకు వాటిని నిలబెట్టుకోలేకపోయాయి. బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లలో అధిక స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటుచేసుకోవడం వల్ల నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 19 పైసలు పెరిగి రూ.93.14 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1.54 శాతం పెరిగి 96.38 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లూ సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి.
మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.25 లక్షల కోట్లు పెరిగి రూ.460.80 లక్షల కోట్లకు చేరింది. 1000 పాయింట్ల ఊగిసలాట: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 78,677.56 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,111.24) లాభాల్లో ఆరంభమైంది. ఆ తర్వాత ఆ లాభాలను క్రమక్రమంగా తగ్గించుకుంటే మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఒకానొక దశలో 77,674.93 పాయింట్ల వద్ద కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 122.56 పాయింట్ల నష్టంతో 77,988.68 పాయింట్ల వద్ద ముగిసింది. రోజు మొత్తం మీద సెన్సెక్స్ అటూ ఇటూ 1000 పాయింట్లు ఊగిసలాడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 34.55 పాయింట్లు కోల్పోయి 24,196.75 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,102.80 వద్ద కనిష్ఠాన్ని; 24,400.95 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. 16 కిందకు.. 14 పైకి: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 14 మినహా మిగతా 16 కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.75%, టైటన్ 1.37%, మహీంద్రా అండ్ మహీంద్రా 1.07%, భారతీ ఎయిర్‌టెల్ 0.82%, హిందుస్థాన్ యునిలీవర్ 0.79%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.75%, బజాజ్ ఫైనాన్స్ 0.74% నష్టపోయాయి. మరోవైపు ట్రెంట్ 2.69%, ఎటెర్నల్ 2.54%, అదానీ పోర్ట్స్ 2.3%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 1.81%, ఇన్ఫోసిస్ 1.05%, ఎల్అండ్‌టీ 1.02% మేర పెరిగాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో లోహ, ఐటీ, ఇంధనం రాణించగా.. బ్యాంకింగ్, వాహన షేర్లు డీలాపడ్డాయి.

# విప్రో రూ.15,000 కోట్ల షేర్ల బై బ్యాక్



పంచవ్యాప్తంగా నెలకొన్న సవాళ్లతో కూడిన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో లాభం తగ్గింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, విధానపరమైన మార్పులు ఇప్పుడు 'కొత్త సాధారణం'గా మారాయి. కృత్రిమ మేధ (ఏఐ)లో వస్తున్న మార్పులు మా క్లయింట్ల ప్రాధాన్యతలను మారుస్తున్నాయి. వారి విలువను పెంచేలా బలమైన భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకోవడానికి ఇది మాకు కొత్త అవకాశాలను కల్పిస్తోంది. ఏఐఫస్ట్ ప్రపంచంలో మా స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి, మేం 'సర్వీసెస్ యాజ్ ఏ సాఫ్ట్‌వేర్' మోడల్‌కు మారుతున్నాం. ఓలామ్ గ్రూప్‌తో కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందం, భారీ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు పెడుతున్న పెట్టుబడులకు నిదర్శనం.

**విప్రో సీఈఓ, ఎండీ శ్రీని పల్లియా**

దిల్లీ: ఐటీ సేవల దిగ్గజ సంస్థ విప్రో, రూ.15,000 కోట్ల విలువైన షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. కంపెనీ చరిత్రలోనే అతిపెద్ద షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపినట్లు గురువారం వెల్లడించింది. రూ.2 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరును రూ.250 చొప్పున 60 కోట్ల పుల్లీ పెయిడప్ ఈక్విటీ షేర్లను కంపెనీ తిరిగి కొనుగోలు చేయనుంది. మొత్తం పెయిడప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో ఇది 5.7 శాతానికి సమానం. 'ఒక్కో షేరు రూ.250 చొప్పున రూ.15,000 కోట్లు మించకుండా బైబ్యాక్ చేసే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది' అని ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో విప్రో పేర్కొంది. బైబ్యాక్ ప్రక్రియను 202627 మొదటి త్రైమాసికంలోగా పూర్తి చేయాలని కంపెనీ భావిస్తోంది.

18 శాతం ప్రీమియంతో..
బీఎస్ఈలో గురువారం షేరు ముగింపు ధర రూ.210.20తో పోలిస్తే బైబ్యాక్ ధర దాదాపు 18 శాతం ఎక్కువ. ఈ షేర్ల బైబ్యాక్‌కు వాటాదార్ల అనుమతి లభించాల్సి ఉంటుందని విప్రో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) అపర్ణ అయ్యర్ తెలిపారు. కంపెనీ ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ సభ్యులు ఈ బైబ్యాక్‌లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బైబ్యాక్ ప్రక్రియను పర్యవేక్షించడానికి, పూర్తి చేయడానికి ఇప్పటికే ఒక కమిటీని విప్రో ఏర్పాటు చేసింది. ఐటీ రంగ చరిత్రలో విప్రో రూ.15000 కోట్ల షేర్ల బైబ్యాక్ మూడో అతిపెద్దది.
త్రైమాసిక లాభం రూ.3,502 కోట్లు: గత ఆర్థిక సంవత్సరం (202526) జనవరి మార్చి త్రైమాసికంలో రూ.3,501.8 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని విప్రో ఆర్జించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.3,569.6 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 1.89 శాతం తక్కువ. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.22,504.2 కోట్ల నుంచి 7.6 శాతం పెరిగి రూ.24,236.3 కోట్లకు చేరింది. డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే లాభం, ఆదాయం వరుసగా 12.2%, 2.8% వృద్ధి చెందాయి.
పూర్తి ఆర్థిక సంవత్సరంలో: 202526లో విప్రో రూ.13,197.4 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. 202425లో రూ.13,135.4 కోట్లతో పోలిస్తే ఇది 0.47% ఎక్కువ. మొత్తం ఆదాయం 3.96% అధికమై రూ.92,624 కోట్లుగా ఉంది. 202526 ఆర్థిక సంవత్సరానికి గతంలో ప్రకటించిన రూ.11 మధ్యంతర డివిడెండ్‌నే తుది డివిడెండ్‌గా పరిగణించనున్నట్లు కంపెనీ వివరించింది.




పెరిగిన ఉద్యోగులు: జూన్‌తో ముగిసే ప్రస్తుత త్రైమాసికంలో ఐటీ సేవల ఆదాయం 2597 2651 మిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని విప్రో అంచనా వేస్తోంది. అమెరికాలోని ఒక క్లయింట్ సమస్య, కొన్ని డీల్స్ ఆలస్యం కావడం వల్ల ఈ అంచనాలు కొంత తక్కువగా ఉన్నాయి. 202526 చివరికి కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,42,156కి చేరింది. గతేడాది ఇది 2,33,346గా ఉంది. ఈ ఏడాది కంపెనీ 7,500 మంది ఫ్రెషర్లను నియమించుకుంది.
గురువారం బీఎస్ఈలో విప్రో షేరు 0.19% లాభపడి రూ.210.20 వద్ద ముగిసింది. మార్కెట్ ముగిసిన తర్వాత త్రైమాసిక ఫలితాలు వెలువడ్డాయి.
విప్రో హైడ్రాలిక్స్ చేతికి ఇండెకో ఇండ్ స్పా
ఇటలీకి చెందిన ఇండెకో ఇండ్ స్పాలో మెజారిటీ వాటాను కొనుగోలు చేయడానికి డెఫినిటివ్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్‌లో భాగమైన విప్రో హైడ్రాలిక్స్ ప్రకటించింది. హైడ్రాలిక్ హ్యామర్లు, మల్చింగ్ హెడ్స్, షియర్స్ వంటి కూల్చివేత, రీసైక్లింగ్ పరిశ్రమలకు అవసరమైన పరికరాలను ఇండెకో తయారు చేస్తుంది. ఈ కంపెనీకి ఇటలీలో 7, అమెరికాలో ఒకటి చొప్పున మొత్తం 8 తయారీ కేంద్రాలు ఉన్నాయి.

# భారత్‌లో 48.3 కోట్ల అవాంఛిత ప్రకటనల నిలిపివేత: గూగుల్




దిల్లీ: 2025లో నిబంధనలను ఉల్లంఘించిన 48.3 కోట్ల ప్రకటనలను భారత్‌లో బ్లాక్ లేదా తొలగించినట్లు గూగుల్ తెలిపింది. ఇదే సమయంలో నిబంధనలను పాటించని 17 లక్షల అడ్వర్టైజర్ ఖాతాలను నిలిపివేసినట్లు వెల్లడించింది. ఏఐ ప్లాట్‌ఫామ్ జెమినై సాయంతో ఈ చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేసింది. గురువారం విడుదల చేసిన గూగుల్ '2025 యాడ్స్ సేఫ్టీ రిపోర్ట్' ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా గతేడాది 830 కోట్లకు పైగా చెడు ప్రకటనలను గూగుల్ తొలగించగా, 2.49 కోట్ల అడ్వర్టైజర్ ఖాతాలను సస్పెండ్ చేసింది. జనరేటివ్ ఏఐను ఉపయోగించి మోసగాళ్లు తప్పుడు ప్రకటనలు సృష్టిస్తుండటంతో, జెమినై ఏఐ మోడళ్లను అనుసంధానించడం ద్వారా అటువంటి వారిని గూగుల్ అడ్డుకోగలుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా తొలగించిన 830 కోట్ల ప్రకటనల్లో, 99% కంటే ఎక్కువ వాటిని వినియోగదార్లు చూడకముందే గూగుల్ నిలిపివేసింది. 2024తో పోలిస్తే 2025లో నాలుగు రెట్లు ఎక్కువగా యూజర్ రిపోర్టులపై చర్యలు చేపట్టింది. మన దేశంలో ప్రకటనల తొలగింపునకు దారితీసిన ప్రధానమైన 5 కారణాల్లో ట్రేడ్‌మార్క్, ఆర్థిక సేవలు, కాపీరైట్, పర్సనలైజేషన్ పాలసీ ఉల్లంఘనలు, యాడ్ నెట్‌వర్క్‌ను దుర్వినియోగం చేయడం ఉన్నాయి.

# విమాన పరిశ్రమకు రూ.18,000 కోట్ల నష్టం



పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి దాకా భారత్‌కు వచ్చే పర్యాటకుల రద్దీ 1520 శాతం మేర తగ్గింది. అదే సమయంలో విమానయాన పరిశ్రమకు రూ.18,000 కోట్ల నష్టం వచ్చిందని ఒక నివేదిక పేర్కొంది. 'భారత పర్యాటకం, విమానయం, ఆతిథ్య రంగాలపై పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం' పేరిట విడుదలైన ఈ నివేదిక ప్రకారం.. విమానయాన రంగం ఎక్కువగా ప్రభావితమైంది. విమానయాన సంస్థలకు విమాన రద్దులు, గగనతల ఆంక్షలు, అంతర్జాతీయ మార్గాల మళ్లింపు వంటి సమస్యలు ఎదురయ్యాయి. దీంతో కీలక మార్గాల్లో విమానయాన సమయం 24 గంటల మేర పెరిగింది. ఇది కాస్తా ఇంధన వినియోగాన్ని, ఆపరేటింగ్ వ్యయాలను పెంచింది. ఎందుకంటే విమానయాన నిర్వహణ వ్యయాల్లో ఇంధన వ్యయాల వాటా 3540 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులు విమానయాన సంస్థల లాభదాయకతకు మరింత గండి కొట్టవచ్చు. మొత్తం మీద విమానయాన పరిశ్రమకు రూ.18,000 కోట్ల నికర నష్టం వాటిల్లవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసినట్లు పీహెచ్‌డీసీసీఐ వెల్లడించింది. ఇక పర్యాటకం విషయానికొస్తే, విరామ ప్రయాణాలు 1520% మేర తగ్గాయి. యుద్ధం వేళ అంతర్జాతీయ ప్రయాణికులు అప్రమత్తతను పాటించడం ఇందుకు నేపథ్యం. రెస్టారెంట్, ఆహార సేవల రంగంపై మిశ్రమ ప్రభావం పడుతోంది. దిగుమతి చేసుకునే ముడి సరుకుల అధిక ధరలకు తోడు లాజిస్టిక్స్, ఇంధన ధరల భారమూ పడుతోందని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పేర్కొంది.
రోజుకు రూ.2,650 కోట్ల నష్టం
భారతీయ ఆహార సేవల మార్కెట్ 2024లో రూ.5.69 లక్షల కోట్లుగా ఉండగా, 2028 కల్లా రూ.7.76 లక్షల కోట్లకు చేరొచ్చన్న అంచనాలున్నాయి. 2026లో రూ.6.46 లక్షల కోట్లుగా నమోదు కావొచ్చు. అంటే రోజువారీగా రూ.17,700 కోట్ల లావాదేవీలు జరుగతాయన్నమాట. 1520% మేర తగ్గుదల అంటే రోజుకు రూ.2650 కోట్ల మేర గండి పడుతుంది.
ఇంధన సరఫరా ఆటంకాలపై ఐఈఏ ఆందోళన
ఇరాన్ యుద్ధం ఇలాగే కొనసాగి ముడిచమురు సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే ఐరోపాలో విమానాల రాకపోకలు త్వరలో నిలిచిపోయే అవకాశం ఉందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) హెచ్చరించింది. ప్రస్తుతం ఐరోపాలోని విమానాలకు 6 వారాలకు సరిపోయే ఇంధనం మాత్రమే ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐఈఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫతిహ్ బిరోల్ మాట్లాడుతూ 'హర్మూజ్ జల సంధిలో ఏర్పడిన ఆటంకాలు దీర్ఘకాలంలో ఇలాగే కొనసాగితే.. ప్రపంచ దేశాల ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణంపై అది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫలితంగా పెట్రోలు, గ్యాస్, విద్యుత్ ధరలు అధికమవుతాయి. ముడిచమురు కోసం మధ్యప్రాచ్యంపై ఆధారపడిన భారత్, జపాన్, కొరియా, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి ఆసియా దేశాలపై ముందు ఈ ప్రభావం ఉంటుంది. తర్వాత ఐరోపా, అమెరికాలపైనా దీని తీవ్రత ఉంటుంద'ని పేర్కొన్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తల కోసం

# లీడ్‌హర్‌షిప్: ఆదిత్య బిర్లా క్యాపిటల్




హైదరాబాద్: ఆర్థిక సేవల (ఫిన్‌టెక్) రంగంలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ (ఏబీసీఎల్) 'లీడ్‌హర్‌షిప్' అనే సరికొత్త మార్గదర్శక కార్యక్రమాన్ని ప్రారంభించింది. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల్లో నాయకత్వ స్థానాలకు మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే లక్ష్యంతో ఇన్ఫినిటీ కింద దీనికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా, ప్రారంభ దశలో ఉన్న మహిళా స్టార్టప్ వ్యవస్థాపకులకు ఆదిత్య బిర్లా క్యాపిటల్‌లోని సీనియర్ మహిళా నాయకులు మూడు నెలలపాటు ప్రత్యేకంగా మార్గదర్శకత్వం వహిస్తారు. వ్యాపార సవాళ్లను అధిగమించి, స్థిరమైన వృద్ధిని సాధించేలా వారికి అండగా నిలుస్తారు. ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక పర్యావరణ వ్యవస్థను నిర్మించాలనే తమ లక్ష్యానికి ఈ కార్యక్రమం నిదర్శనమని సంస్థ ఎండీ, సీఈఓ విశాఖ ముల్యే పేర్కొన్నారు. లీడ్‌హర్‌షిప్ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసేందుకు బీఫెయిర్ ల్యాబ్స్‌తో సంస్థ భాగస్వామ్యం కుదుర్చుకుంది.

## వోల్వో కీలక ప్రకటన:

# రూ.లక్ష వరకు పెరగనున్న ధరలు!



వోల్వో కార్ ఇండియా.. 2026 మే 1 నుంచి తమ కార్ల ధరలను లక్ష రూపాయల వరకు పెంచుతున్నట్లు ధృవీకరించింది. ఇటీవల పెరుగుతున్న ఖర్చుల కారణంగా ఆడి, మెర్సిడెస్-బెంజ్, బీఎండబ్ల్యూ వంటి ఇతర లగ్జరీ బ్రాండ్‌లు కూడా ధరలను సర్దుబాటు చేయవలసి వస్తున్న నేపథ్యంలో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.
వోల్వో భారత పోర్ట్‌ఫోలియోలో నాలుగు ప్రధాన మోడళ్లు ఉన్నాయి. అవి EX30, EC40, XC60, XC90. ప్రతి మోడల్‌కు సంబంధించిన నిర్దిష్ట ధరల పెంపులను కంపెనీ వెల్లడించనప్పటికీ, అన్ని వేరియంట్‌ల ధరలను గరిష్టంగా రూ.1 లక్షకు పరిమితం చేయనున్నట్లు సమాచారం. కొత్త ధరలు మే 1వ తేదీ నుంచి బుకింగ్‌లు, డెలివరీలకు వర్తిస్తాయి. అంటే అంతకు ముందు బుక్ చేసుకున్న లేదా కొనుగోలు చేసే కార్లకు పాత ధరలే వర్తిస్తాయి. కాగా వోల్వో కార్ ఇండియా దేశవ్యాప్తంగా 23 షోరూమ్‌లు మరియు 25 సర్వీస్ సెంటర్ల నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది.

# ధనుష్‌తో సారా అర్జున్?



త్వరలో 'కర' సినిమాతో తెరపైకి రావడానికి సన్నద్ధమవుతున్నారు ధనుష్. పలు భాషలలో వరుస సినిమాలతో బిజీగా గడుపుతున్న ఈయన ఖాతాలో దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు తెరకెక్కిస్తున్న ఓ సినిమా ఉన్న సంగతి తెలిసిందే. 'డీ 56' (వర్కింగ్ టైటిల్)గా పట్టాలెక్కబోతున్న ఈ చిత్రంలో ధనుష్‌తో అందాల తార రుక్మిణీ వసంత్ జోడీ కట్టనున్నట్లు కొన్నిరోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇప్పుడామె స్థానంలో బాలీవుడ్ యువ కథానాయిక సారా అర్జున్‌ను తీసుకున్నట్లు సమాచారం. ''పలు ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల రుక్మిణి ఈ చిత్రాన్ని అంగీకరించలేకపోయింది. ఇప్పుడా పాత్ర కోసం 'ధురంధర్'తో మంచి క్రేజ్ సంపాదించుకున్న సారాను ఎంపిక చేసే పనిలో పడింది చిత్రబృందం. ఒకవేళ అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. ఆమె మొదటి తమిళ చిత్రమిదే కానుంద''ని తమిళ సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరి రుక్మిణి, సారా.. ఈ ఇద్దరిలో ధనుష్ సరసన నటించేదెవరు? అనే విషయంపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# టాప్ టెన్‌లో ఉంటావులే..



మంగ లేకపోతే తిరుపతి వదిలివెళ్లే ప్రసక్తే లేదు అంటున్నాడు శ్రీను. ఎంతగానో ప్రేమించిన మంగ తనది కాదు అని తెలిసిన క్షణం శ్రీను ఏ నిర్ణయం తీసుకున్నాడో తెలియాలంటే 'శ్రీనివాస మంగాపురం' చూడాల్సిందే. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరుడి కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ కథానాయిక. మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. అజయ్ భూపతి దర్శకుడు. అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ సమర్పణలో... చందమామ కథలు పిక్చర్స్ పతాకంపై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్‌ని ప్రముఖ కథానాయకుడు మహేశ్‌బాబు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. 'ఈ క్షణం ఇప్పటికిప్పుడు నీకేమనిపిస్తుంది... నేనసలు నీ ఫ్రెండ్ లిస్ట్‌లో ఉన్నానా?' అంటూ కథానాయకుడు అడగ్గా, టాప్ టెన్‌లో ఉంటావులే... అంటూ కథానాయిక ఇచ్చే సమాధానంతో టీజర్ మొదలవుతుంది. శ్రీను, మంగా అనే యువ జంట చుట్టూ అల్లుకున్న కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ''అందమైన జంట, ఆకట్టుకునే ప్రేమకథ, హత్తుకునే భావోద్వేగాలు, అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కుతోన్న చిత్రమిది. తిరుపతి నేపథ్యం సినిమాకి మరింత కొత్తదనాన్ని తీసుకొచ్చింద''ని సినీవర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: జయకృష్ణ, కూర్పు: మాధవ్ కుమార్ గుళ్లపాటి, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేశ్.

# అది దీపిక సంపాదించుకున్న స్థాయి ... ఆమెకు ఆ హక్కు ఉంది...: కంగన

ఇండస్ట్రీలో వర్కింగ్ అవర్స్‌పై అనేక మంది నటీనటులు తమ స్పందన తెలియజేసిన సంగతి తెలిసిందే. ఈ చర్చ ఇంకా కొనసాగుతూనే ఉంది. పని గంటల విషయంలో అభిప్రాయ భేదాలు రావడంతో అగ్ర కథానాయిక దీపిక పదుకొణె భారీ ప్రాజెక్ట్‌లు సైతం వదులుకున్నారు. తాజాగా ఈ విషయమై నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ స్పందించారు. దీపికకు మద్దతుగా నిలబడ్డారు. 8 గంటలు మాత్రమే పనిచేస్తానని దీపిక చెప్పడం సబబేన్నారు. ఎంతో కష్టపడి ఆమె ఈ స్థాయికి వచ్చారని, నటించే విషయంలో తనకంటూ నిర్ణయం తీసుకునే హక్కు ఉందన్నారు. పైగా ఇప్పుడామె ఓ బిడ్డకు తల్లి కూడా అని ఎంపీ కంగనా రనౌత్ అన్నారు.''వర్కింగ్ అవర్స్ విషయంలో వివాదం సృష్టించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే బాలీవుడ్‌లో ప్రస్తుతం దీపిక పదుకొణె స్థానం ఆమె ఎంతో కష్టపడి సంపాదించుకున్నది. పైగా ఇప్పుడామె ఓ బిడ్డకు తల్లి. అగ్ర కథానాయిక. ఒకవేళ ఆమె 8 గంటలు మాత్రమే పని చేస్తానని అంటే కచ్చితంగా ఆ నిర్ణయం తీసుకున్న హక్కు తనకి ఉంది. గతంలో నేను దీపికను కలిసినప్పుడు తాను ఇంతియాజ్ అలీ సినిమా కోసం 12 గంటల పాటు పనిచేస్తున్నట్లు చెప్పింది. అప్పుడు నేను కేవలం 10 గంటలు మాత్రమే పనిచేస్తానని చెప్పా. అప్పట్లో మేము సినిమా కోసం ఎన్ని గంటలైనా పనిచేసేవాళ్లం. చాలా ఉత్సుకతతో ఉండేవాళ్లం. ఏదైనా చేయడానికి రెడీ అనే వాళ్లం. అందుకే మేము సక్సెస్ అయ్యాం'' ''కొత్తగా ఇండస్ట్రీకి వచ్చిన సమయంలో ఎవరికైనా వారి స్థానం, పాత్ర మారిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడు దీపిక స్థానం ప్రత్యేకం. పైగా ఆమె ఓ బిడ్డకు తల్లి. కుటుంబం తర్వాతే ఏమైనా. ఎంతో కష్టపడి ఆమె ఈ స్థాయికి చేరుకుంది. ఎవరైనా కచ్చితంగా తనతో పనిచేయాలనుకుంటే ఆ 8 గంటలు పనిచేయడానికి ఇష్టపడే పిలుస్తారు. అలా ఎందుకు చేయకూడదు. ప్రస్తుతం ఎక్కువమంది సంతాన సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. వివాహ బంధాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు ఏం చేస్తారు? మాపై ఒత్తిడి పెరుగుతూ వస్తోంది. ఇటు కుటుంబం అటు పిల్లలతో పని రెట్టింపు అవుతోంది. ఇప్పుడు పేర్లు చెప్పాల్సిన పనిలేదు. చాలా మంది నటులు ఏళ్ల నుంచి 8 గంటలు మాత్రమే పనిచేస్తున్నారు. వారాంతాల్లో వారు షూటింగ్‌లకు రారు'' అని కంగనా చెప్పుకొచ్చారు. 'స్పిరిట్', 'కల్కి 2' నుంచి వైదొలిగిన తర్వాత దీపికా పదుకొణె పని గంటలపై స్పందించారు. తనకు ఆరోగ్యమే ముఖ్యమని అన్నారు. నిద్ర, పోషకాహారం, వ్యాయామం... వీటికి ఎక్కువ ప్రాధాన్యమివ్వాలన్నారు.



# తమన్నా పిటిషన్.. కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు



'పవర్ సోప్స్' కంపెనీపై నటి తమన్నా దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తన ఆరోపణలకు సంబంధించి నటి తగిన సాక్ష్యాలు చూపలేకపోవడంతో పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది.బ్రాండ్ ప్రమోషన్స్‌కు సంబంధించి తమన్నా, పవర్ సోప్స్ కంపెనీ మధ్య 2008లో ఒప్పందం కుదిరింది. 2009 అక్టోబరు వరకూ తమన్నా ఫొటోలతో పవర్ సోప్స్ ప్రచారం చేసుకోవడం అగ్రిమెంట్. అయితే ఒప్పందం గడువు ముగిసినప్పటికీ 2010 2011 మధ్య సదరు సంస్థ తన ఇమేజ్‌లను అనధికారికంగా వినియోగించుకుందని తమన్నా ఆరోపించారు. ఇందుకుగానూ సంస్థ నుంచి రూ.కోటి నష్టపరిహారం డిమాండ్ చేస్తూ.. ఆ కంపెనీ తన ఫొటోలు వాడకుండా చేయాలంటూ తమన్నా ఇటీవల కోర్టును ఆశ్రయించారు. ఏకసభ్య ధర్మాసనం తీర్పును సవాలు చేస్తూ మరో పిటిషన్ వేశారు. సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది.



# నాన్న నాలుగు గంటలే నిద్రపోయిన రోజులు కూడా చూశా.. రామ్‌చరణ్

నాన్న చిరంజీవి ఎంతో మందిపై ప్రభావం చూపారని, రోజూ ఆయనను చూస్తూ పెరగడం వల్ల తనపై ఆయన ప్రభావం ఎక్కువగా ఉందని తనయుడు, సినీ నటుడు రామ్‌చరణ్ అన్నారు. ప్రముఖ మ్యాగజైన్ 'ఎస్క్వైర్ ఇండియా' కవర్ పేజీపై చరణ్ మెరిసిన విషయం తెలిసిందే. ఈ కవర్ స్టోరీ కోసం ఆయన కొన్ని ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. తన జీవితంలో రియల్ హీరో తండ్రి చిరంజీవి అని ఈ సందర్భంగా చెప్పారు.''కుటుంబం, సినీ ఇండస్ట్రీలో ఎవరైనా కష్టంలో ఉన్నారని తెలిస్తే, ముందు స్పందించే వ్యక్తి చిరంజీవి. చాలా సందర్భాల్లో నేను ఇది గమనించా. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ముందుకు వెళ్లేవారు. ఇది అసలైన వారసత్వం. ఇది కుటుంబం పట్ల బాధ్యత, పని పట్ల క్రమశిక్షణ'' ''నాన్న వారసత్వాన్ని మేము సులభంగానే తీసుకున్నాం. విజయాలు, స్టార్‌డమ్ ఎన్ని ఉన్నా కూడా ఇంటి దగ్గర సగటు తండ్రిగా ఉండేవారు. అది చాలాప్రత్యేకం. ఇప్పటివరకూ ఏ నటుడిలో ఇది చూడలేదు. మున్ముందు ఏ నటుడిలోనూ చూడలేకపోవచ్చు'' ''సినిమా కోసం రోజులో కేవలం నాలుగు గంటలే నిద్రపోయిన సందర్భాలు ఉన్నాయి. అదే సమయంలో వరుస షూటింగ్‌ల నుంచి మూడు రోజులు విరామం తీసుకుని, కుటుంబ సభ్యులు, సోదరులతో సమయం గడిపేవారు. ఆయన అటు పని.. ఇటు కుటుంబాన్ని సమన్వయం చేసేవారు. నేను ఇదే పద్ధతి అనుసరించాలని అనుకుంటున్నా'' ''ఈ ప్రపంచం ఎప్పుడూ విమర్శలు, నెగెటివిటీ, కొన్నిసార్లు అవహేళన చేయడానికి సిద్ధంగా ఉంటుంది' అని నాన్న చెబుతూ ఉంటారు. ఆత్మగౌరవం, మన ఆలోచనాధోరణి, నమ్మిన దానికి కట్టుబడి ఉండే తత్వం మనల్ని దృఢంగా ఉండేలా చేస్తాయి. మనపై మనకు నమ్మకం ఉంటే, ఎవరూ మనల్ని ఏమీ చేయలేరు'' అని చరణ్ అన్నారు.ఇక రామ్‌చరణ్ సినిమాల విషయానికొస్తే, బుచ్చిబాబు దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'పెద్ది'. ఏప్రిల్ 30న విడుదల కావాల్సిన ఈ మూవీ జూన్‌కు వాయిదా పడింది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న 'పెద్ది'లో జాన్వీ కపూర్ కథానాయిక.

# ధీవరా... స్వప్నం సాధించరా

**నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు'. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మించారు. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. "రా రా ధీవర.. లేరా లేవరా.. విజృంభించరా.. స్వప్నం సాధించరా" అంటూ ఓ యోధుడి నినాదంలా సాగిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యమందించారు. రవి బస్రూర్ స్వరాలు సమకూర్చగా.. సంతోష్ వెంకీ ఆలపించారు. ఈ పాటలో యోధుడిలా నిఖిల్ కనిపించిన తీరు.. ఖడ్గం చేతబట్టి చేసిన సాహసాలు అన్నీ ఆకర్షణగా నిలిచాయి. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. త్వరలో విడుదల తేదీపై స్పష్టత ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి కేకే సెంథిల్ కుమార్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.**



# రివ్యూ: పాపం ప్రతాప్.. తిరువీర్ ఎంటర్‌టైనర్ మెప్పించిందా?

చిత్రం: పాపం ప్రతాప్; నటీనటులు: తిరువీర్, అజయ్ ఘోష్, రాశి, పాయల్ రాధాకృష్ణ, దేవి ప్రసాద్, గోపరాజు రమణ, రవి ఆంటోని, రఘుబాబు, ప్రసాద్ బెహరా, అనంత్ బాబు, బాషా, శ్రీనివాస్ అవసరాల; సంగీతం: కేఎం రాధాకృష్ణ, సురేష్ బొబ్బిలి (నేపథ్యం); సినిమాటోగ్రఫీ: విశ్వేశ్వర్ ఎస్.వి.; ఎడిటర్: అన్వర్ అలీ; రచన, దర్శకత్వం: ఎస్పీ దుర్గా నరేశ్; విడుదల: 17042026...... మంచి కథలతో సినిమాలు చేస్తారన్న పేరు సంపాదించిన తిరువీర్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'పాపం ప్రతాప్'. ఈటీవీ విన్ నుంచి సినిమా వస్తుండడం, ఈ కలయికపై ఉన్న ఆసక్తికి తగ్గట్టుగానే ట్రైలర్ అందరి దృష్టిని ఆకర్షించడంతో ఈ చిత్రంపై అంచనాలు పెరిగాయి. మరి సినిమా ఎలా ఉంది? ఎలాంటి వినోదాన్ని పంచింది?

**--కథేంటంటే..**

ప్రతాప్ (తిరువీర్)కి బుజ్జమ్మ (పాయల్ రాధాకృష్ణ) అంటే చిన్నప్పటి నుంచీ ప్రేమ. ఆమె ప్రేమ కోసం పరితపించి అందులో విజయం సాధిస్తాడు. పెళ్లి తర్వాత ప్రేమ ఎలా ఉంటుందో చూద్దామని ఇద్దరూ కలిసి ఏడడుగులు వేస్తారు. మొదటి మూడు రాత్రులు గడిచాయో లేదో ఆలుమగల మధ్య పంచాయితీ రచ్చకెక్కుతుంది. ప్రతాప్‌కి సమస్య ఉందంటూ పుట్టింటికి వెళ్లిపోతుంది బుజ్జమ్మ. ఆ సమస్య ఏమిటనేది మాత్రం పంచాయతీ పెద్దలకు చెప్పదు. తనలోని సమస్యేమిటో తనే తెలుసుకుని సరిదిద్దుకుంటేనే కాపురానికి వస్తానని తెగేసి చెబుతుంది. బుజ్జమ్మపై గుండెల నిండా ప్రేమ ఉన్న ప్రతాప్ తనలోని సమస్యేమిటో తెలుసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేశాడు?ఇంతకీ ఆ సమస్య ఏమిటి?సరిదిద్దుకున్నాడా లేదా?బుజ్జమ్మ, ప్రతాప్ ఒక్కటయ్యారా?అన్నది చిత్ర కథ.

**--ఎలా ఉందంటే..**

వదులుకోలేని ప్రేమ, కలిసి బతకలేని సమస్య. ఆ రెండింటి మధ్య సంఘర్షణే ఈ సినిమా. చివరికి ప్రేమ గెలిచిందా?లేక సమస్యదే పైచేయి అయ్యిందా అన్నదే సినిమాలో కీలకం. 90వ దశకంలోని గోదావరి పల్లెటూరు నేపథ్యంలో ఓ మంచి ప్రేమకథలా, సరదా సన్నివేశాలతో మొదలవుతుందీ చిత్రం. ఆ వెంటనే పెళ్లి, ఆ తర్వాత ప్రతాప్‌లో సమస్య అంటూ వేగంగా అసలు కథలోకి తీసుకెళుతుంది. ప్రతాప్‌లో ఉన్న సమస్య ఏమిటనేది వెంటనే బయటకు చెప్పకుండా ప్రేక్షకుల్లో కాసేపు ఆసక్తిని రేకెత్తించిన దర్శకుడు... సరైన దిశగానే సినిమాని ముందుకు నడిపించాడు. కానీ, తనలోని సమస్యని కనుక్కునేందుకు కథానాయకుడు తన స్నేహితుడితో కలిసి చేసే ప్రయాణం, ఆ నేపథ్యంలోని సన్నివేశాలే కాస్త ఇబ్బందికరం. బుజ్జమ్మ తనకు ఎదురవుతున్న సమస్యని అత్తింటి వారికో, పుట్టింటివారికో చెప్పకుండా నేరుగా ఊరి పెద్దల మధ్యకు తీసుకెళ్లడం.. ఆ సమస్యకూ, కథానాయకుడిలోని ప్రేమకు ముడిపెట్టడం కూడా అంతగా అతకలేదేమో అనిపిస్తుంది. విరామ సన్నివేశాలతో కథ కీలక మలుపు తిరుగుతుంది. ద్వితీయార్థంలో కథానాయకుడిలో ఉన్న సమస్యకు మూలాల గురించి చెప్పే ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలు ఆసక్తిని రేకెత్తిస్తాయి. పతాక సన్నివేశాలతోపాటు, అంతకుముందు డ్రామా కూడా రక్తికడుతుంది. రచ్చబండ నేపథ్యంలో ఊరి జనాలకీ, కథానాయకుడికీ మధ్య సన్నివేశాలు హాస్యం పంచడంతోపాటు, అలరిస్తాయి. సందర్భోచిత హాస్యం ఈ సినిమాకి బలం.

**--ఎవరెలా చేశారంటే..**

ప్రతాప్ పాత్రకు తిరువీర్ న్యాయం చేశారు. అమాయకత్వం నిండిన ఆ పాత్రలో ఒదిగిపోయిన విధానం సహజంగా ఉంది. కథానాయిక పాయల్ రాధాకృష్ణ కూడా పాత్రకి తగ్గ ఎంపిక. ఎదుటి వ్యక్తులపై మాటలతో విరుచుకుపడే పాత్రలో అజయ్ ఘోష్ కనిపిస్తారు. ఒక దశ దాటిన తర్వాత ఆ పాత్ర చాలా సాధారణమైపోతుంది. ఆయనకి జోడీగా ఒకప్పటి కథానాయిక రాశి కనిపిస్తారు. పతాక సన్నివేశాల్లో రాశి నటన మెప్పిస్తుంది. ప్రసాద్ బెహరా, గోపరాజు రమణ, రఘుబాబు, దేవిప్రసాద్, రవి ఆంథోనీ , మహబూబ్ బాషా తదితరులు కీలకమైన పాత్రల్లో కనిపిస్తారు. సాంకేతిక విభాగాల్లో కె.ఎం.రాధాకృష్ణన్ పాటలు మెప్పిస్తాయి. ఎడిటింగ్ మినహా ఇతర విభాగాలు పర్వాలేదనిపిస్తాయి. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే అంశంతోనే దర్శకుడు కథని రాసుకున్నారు కానీ, కథనం, సన్నివేశాల రచనలో ఇంకా పదును పెంచాల్సింది. అక్కడక్కడా మాటలు మెప్పిస్తాయి.

**--బలాలు....**

+ తిరువీర్ నటన, - అక్కడక్కడా హాస్యం, - ద్వితీయార్థం,

**--బలహీనతలు......**

కథనం, సాగదీతగా సన్నివేశాలు

చివరిగా: పాపం ప్రతాప్... ప్రేక్షకులకు మాత్రం వినోదం పంచుతాడు

గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!





# ధోని వచ్చేశాడు

హైదరాబాద్: ఐపీఎల్‌లో భాగంగా ఉప్పల్ స్టేడియంలో శనివారం సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ అమితాసక్తిని రేపుతోంది. గత మ్యాచ్‌లో గెలిచిన హైదరాబాద్ అదే జోరును కొనసాగించాలని భావిస్తుండగా...వరుసగా రెండు విజయాల తర్వాత చెన్నై కూడా అమితోత్సాహంతో బరిలోకి దిగనుంది. అయితే స్టార్ ప్లేయర్ మహేంద్ర సింగ్ ధోని ఈ మ్యాచ్‌లోనైనా ఆడతాడా లేదా అనేదే అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తున్న అంశం. గాయంతో బాధపడుతున్న ధోని ఇప్పటి వరకు సీఎస్‌కే ఆడిన ఐదు మ్యాచ్‌లలో కూడా బరిలోకి దిగలేదు. కోల్‌కతాతో జరిగిన గత మ్యాచ్‌కు ముందు ధోని సుదీర్ఘ సమయం పాటు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. మ్యాచ్ ఆడకపోయినా పూర్తి ఫిట్‌గా కనిపించాడు. చెన్నైలో ఆగిపోకుండా అతను హైదరాబాద్‌కు రావడంతోనే మ్యాచ్ ఆడతాడనే అంచనాలు పెరిగాయి. గురువారం ఫ్యామిలీతో కలిసి నగరానికి వచ్చిన ధోనిని చూసేందుకు శంషాబాద్ విమానాశ్రయంలో అభిమానులు పెద్ద సంఖ్యలో ఎగబడ్డారు.

## పంజాబ్ 'టాప్' షో

# ముంబైపై 7 వికెట్లతో ఘన విజయం

**ముంబై: బౌలర్ల క్రమశిక్షణకు బ్యాటర్ల జోరు తోడవడంతో... ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ అజేయంగా సాగుతోంది. గురువారం జరిగిన పోరులో పంజాబ్ కింగ్స్ 7 వికెట్ల తేడాతో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను చిత్తుచేసింది. నాలుగో విజయంతో పంజాబ్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరగా... ముంబై వరుసగా నాలుగో పరాజయం మూటగట్టుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (60 బంతుల్లో 112 నాటౌట్; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. ఈ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే డికాక్ దుమ్మురేపాడు. నమన్ ధీర్ (31 బంతుల్లో 50; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీతో రాణించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 68 బంతుల్లోనే 122 పరుగులు జోడించారు.**

గాయం కారణంగా రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌కు దూరం కాగా... రికెల్టన్ (2), సూర్యకుమార్ యాదవ్ (0), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (14), రూథర్‌ఫోర్డ్ (1) విఫలమయ్యారు. పంజాబ్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అర్ష్ దీప్ సింగ్ 22 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో పంజాబ్ కింగ్స్ 16.3 ఓవర్లలో 3 వికెట్లకు 198 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (39 బంతుల్లో 80; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (35 బంతుల్లో 66; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచి కొట్టడంతో లక్ష్యం చిన్నబోయింది.

### బాదుడే... బాదుడు

బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై పంజాబ్ బ్యాటర్లు తొలి ఓవర్ నుంచే ముంబై బౌలర్లపై చెలరేగారు. దీపక్ చహర్ వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ 2 ఫోర్లు కొడితే, ప్రియాన్ష్ ఆర్య (15; 2 ఫోర్లు, 1 సిక్స్) 6, 4 బాదాడు. దీంతో 21 పరుగులు వచ్చాయి. ఆర్యతో పాటు కూపర్ కనోలి (17; 1 ఫోర్, 2 సిక్స్‌లు)ని గజన్‌ఫర్ వరుస ఓవర్లలో అవుట్ చేయగా... ఎదుర్కొన్న తొలి బంతికే బౌండరీ బాది శ్రేయస్ తన ఉద్దేశం చాటాడు. పవర్‌ప్లే ముగిసేసరికి పంజాబ్ 61/2తో నిలిచింది.

ఆ తర్వాత శ్రేయస్, ప్రభ్‌సిమ్రన్ జోరు కనబర్చడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. దీపక్ ఓవర్‌లో 6, 4 కొట్టిన ప్రభ్‌సిమ్రన్... హార్దిక్ ఓవర్‌లో రెండు, శార్దూల్ ఓవర్‌లో రెండు ఫోర్లతో 23 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్ నుంచి శ్రేయస్ కూడా దూకుడు పెంచాడు. బుమ్రా బౌలింగ్‌లో భారీ షాట్‌లతో అలరించిన శ్రేయస్ 31 బంతుల్లో ఫిఫ్టీ మార్క్ అందుకున్నాడు. శార్దూల్ ఓవర్‌లో వరుసగా రెండు సిక్స్‌లు కొట్టిన శ్రేయస్ మరో భారీ షాట్ కొట్టే యత్నంలో అవుటైనా... అప్పటికే పంజాబ్ గెలుపు ఖాయమైంది.






### స్కోరు వివరాలు

**ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** రికెల్టన్ (సి) శశాంక్ (బి) అర్ష్ దీప్ 2; డికాక్ (నాటౌట్) 112; సూర్యకుమార్ (సి) చాహల్ (బి) అర్ష్ దీప్ 0; నమన్ (సి) బార్ట్‌లెట్ (బి) శశాంక్ 50; హార్దిక్ (సి) బార్ట్‌లెట్ (బి) యాన్సెన్ 14; రూథర్‌ఫోర్డ్ (బి) అర్ష్ దీప్ 1; తిల్ (రనౌట్) 8; మయాంక్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 195. వికెట్ల పతనం: 1–12, 2–12, 3–134, 4–175, 5–182, 6–193. బౌలింగ్: అర్ష్ దీప్ సింగ్ 4–0–22–3; యాన్సెన్ 4–0–30–1; బార్ట్‌లెట్ 4–0–39–0; వైశాక్ 3–0–36–0; యుజ్వేంద్ర చాహల్ 3–0– 45–0; శశాంక్ సింగ్ 2–0–19–1.

**పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్:** ప్రియాన్ష్ (సి) దీపక్ (బి) గజన్‌ఫర్ 15; ప్రభ్‌సిమ్రన్ (నాటౌట్) 80; కూపర్ (సి) డికాక్ (బి) గజన్‌ఫర్ 17; శ్రేయస్ (సి) నమన్ (బి) శార్దూల్ 66; స్టొయినిస్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (16.3 ఓవర్లలో 3 వికెట్లకు) 198. వికెట్ల పతనం: 1–27, 2–45, 3–184. బౌలింగ్: దీపక్ 2.3–0–45–0; బుమ్రా 4–0–41–0; గజన్‌ఫర్ 4–0–31–2; హార్దిక్ 3–0–39–0; శార్దూల్ 3–0–42–1.


**ఐపీఎల్‌లో నేడు**
గుజరాత్ X కోల్‌కతా
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

# మెస్సిపై రూ.58 కోట్ల దావా!



మయామి: దిగ్గజ ఫుట్‌బాలర్ లియోనెల్ మెస్సి న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాడు. గత ఏడాది జరిగిన ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆడకపోవడం ద్వారా ఒప్పందాన్ని ఉల్లంఘించాడన్న ఆరోపణలతో మెస్సిపై ఈవెంట్ నిర్వహణ సంస్థ విడ్ మ్యూజిక్ గ్రూప్ 7 మిలియన్ డాలర్లు (సుమారు రూ.58 కోట్లు) దావా వేసింది. మయామికి చెందిన విడ్ గ్రూప్.. మెస్సితో పాటు అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘం (ఏఎఫ్‌ఏ)పై కూడా మోసం, ఒప్పంద ఉల్లంఘన కింద గత నెలలో న్యాయస్థానంలో కేసు దాఖలు చేసింది. అయితే ఈ ఆరోపణలపై మెస్సి, ఏఎఫ్‌ఏ ప్రతినిధులు ఇప్పటి వరకు స్పందించలేదు. నిరుడు అక్టోబరు 10న వెనిజువెలా, ప్యూర్టో రికోలతో అర్జెంటీనా స్నేహపూర్వక మ్యాచ్‌ల నిర్వహణ, ప్రసార, స్పాన్సర్‌షిప్ హక్కుల కోసం ఏఎఫ్‌ఏతో విడ్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం గాయపడితే తప్ప మెస్సి ప్రతి మ్యాచ్‌లోనూ కనీసం 30 నిమిషాల పాటు మైదానంలో ఆడాల్సి ఉంటుంది. అర్జెంటీనా 10తో వెనిజువెలాను ఓడించిన మ్యాచ్‌లో మెస్సి మైదానంలోకి దిగకుండా కేవలం స్టేడియంలోని ఒక గది నుంచి వీక్షించాడు. అయితే మరుసటి రోజు అట్లాంటాతో జరిగిన ఎంఎల్ఎస్ మ్యాచ్‌లో తన క్లబ్ జట్టు ఇంటర్ మయామి తరఫున బరిలో దిగి రెండు గోల్స్ సాధించాడు. అక్టోబరు 14న ప్యూర్టోరికోతో మ్యాచ్‌లో (అర్జెంటీనా 60తో విజయం) మెస్సి ఆడాడు.

# కమిన్స్ వస్తున్నాడు..



హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త. వెన్ను గాయంతో ఆటకు దూరంగా ఉన్న రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఐపీఎల్‌లో బరిలో దిగనున్నాడు. వెన్ను స్కాన్‌లో కమిన్స్ గాయం పూర్తిగా నయమైనట్లు తేలడంతో అతడికి మార్గం సుగమమైంది. కమిన్స్ ఈ నెలాఖరులో మైదానంలో అడుగు పెట్టే అవకాశముంది. గత ఏడాది జులై నుంచి వెన్ను నొప్పితో బాధపడుతున్న కమిన్స్.. ఆ సమయంలో యాషెస్ సిరీస్‌లో ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడాడు. గాయం పెద్దది కావడంతో టీ20 ప్రపంచకప్, ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు కమిన్స్ దూరమయ్యాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన నేపథ్యంలో శుక్రవారం భారత్‌కు బయల్దేరనున్నట్లు సామాజిక మాధ్యమం ద్వారా కమిన్స్ తెలిపాడు. ఈనెల 25న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో అతను బరిలో దిగే అవకాశముంది.

# భారత్ X దక్షిణాఫ్రికా

**టి20 ప్రపంచ కప్‌కు ముందు సన్నాహకాల్లో భాగంగా భారత మహిళల క్రికెట్ జట్టు నేటి నుంచి దక్షిణాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ ఆడనుంది. ఇంగ్లండ్ వేదికగా ఈ ఏడాది జూన్‌లో ప్రపంచ కప్ జరగనున్న నేపథ్యంలో ఒక అగ్రశ్రేణి టీమ్‌తో సిరీస్ టీమిండియాకు ఉపయోగపడనుంది. ఇటీవల ఆస్ట్రేలియా, శ్రీలంకపై టి20 సిరీస్‌లు గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా... సఫారీతో సిరీస్ ద్వారా జట్టు కూర్పును సరిచూసుకోవాలని భావిస్తోంది.**

**కెప్టెన్ హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, దీప్తి శర్మతో భారత జట్టు బలంగా కనిపిస్తోంది. బౌలింగ్‌లో ఆంధ్ర అమ్మాయిలు అరుంధతి రెడ్డి, శ్రీచరణి కీలకం కానున్నారు. 'వరల్డ్‌కప్‌నకు ముందు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనుకుంటున్నాం. వన్డే ప్రపంచకప్ సాధించిన అనంతరం జట్టులో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది' అని హర్మన్ వెల్లడించింది. రాత్రి గం.9:30 నుంచి జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం**



# ఐపీఎల్ నుంచి ఖలీల్ ఔట్

దిల్లీ: ఐపీఎల్ టోర్నీని పేలవంగా ఆరంభించి, ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న చెన్నై సూపర్ కింగ్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన పేసర్ ఖలీల్ అహ్మద్ గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. మంగళవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు తొడ కండరాల గాయానికి గురయ్యాడు. గాయం తీవ్రంగా ఉందని, కోలుకోవడానికి 10 నుంచి 12 వారాల సమయం అవసరమని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది చెన్నై ఆడిన అయిదు మ్యాచ్‌ల్లోనూ బరిలో దిగిన ఈ ఎడమ చేతివాటం ఫాస్ట్ బౌలర్.. రెండు వికెట్లు పడగొట్టాడు. కేకేఆర్‌పై ఉత్తమ ప్రదర్శన (1/24) చేశాడు. చెన్నై.. ఖలీల్ స్థానంలో చేతన్ సకారియాను తీసుకునే అవకాశముంది. ఖలీల్‌లాగే సకారియా కూడా ఎడమ చేతివాటం బౌలర్ కావడమే అందుకు కారణం. సకారియా సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో 7 మ్యాచ్‌ల్లో 12 వికెట్లతో ఆకట్టుకున్నాడు. కొత్త బంతిని స్వింగ్ చేయగల సామర్థ్యం ఉండడంతో.. సకారియాకు సీఎస్కే నుంచి పిలుపు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆకాశ్ మధ్వాల్, సిమర్జీత్ సింగ్, కమ్లేశ్ నాగర్‌కోటి వంటి యువ బౌలర్లు కూడా చెన్నై జట్టు మేనేజ్‌మెంట్ దృష్టిలో ఉన్నారు.

